క్లుప్తంగా

అరటి రైతులను ఆదుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అకాల వర్షాలకు జిల్లాల్లో నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లిందని, 2 వేలకు పైగా ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట నేలకొరిగిందన్నారు. జిల్లాలో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. లింగాల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురవడంతో 2,460 ఎకరాల్లో అరటి పంట కూలి పోయిందని, 827 మంది రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా ఉందన్నారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె, వెలి దండ్ల, పెద్దకుడాల, కె. చెర్లోపల్లె, రామన్నూతనపల్లె, గుణకణపల్లె, లింగాల తదితర గ్రామాల్లో అరటి పంటలు నేలకూలాయన్నారు. ప్రభుత్వం తక్షణం రైతుల వివరాలు సేకరించి పంట నష్టాన్ని అంచనా వేసి పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారం తక్షణం అందేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప జీజీహెచ్‌లో పనిచేస్తున్న ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, ఒక శానిటేషన్ సూపర్‌వైజర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జీజీహెచ్‌లో ఏ1 కాంట్రాక్టర్, ఎక్స్‌పోర్టు సెక్యూరిటీ సర్వీసులో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. జీఓ నెంబరు 549 ప్రకారం రూ. 16 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా, శానిటేషన్ వారికి కేవలం రూ. 12,403, సెక్యూరిటీ వారికి రూ. 10 వేలు ఇవ్వడం దారుణమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని అడిగితే డ్యూటీలకు రావద్దని చెప్పడం దారుణమన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో భాష్యం విద్యాసంస్థలలో ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పర్యవేక్షణలో సాగిన ఈ క్యాంపస్ డ్రైవ్ లో వివిధ విభాగాలకు చెందిన 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 19 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ గణేష్ నాయక్, భాష్యం విద్యాసంస్థల రాయలసీమ కోఆర్డినేటర్ రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కదిరి మండలం కాలసముద్రానికి చెందిన షేక్ మౌలాలి పార్కింగ్ చేసిన బుల్లెట్ వాహలను ఇద్దరు స్నేహితులతో కలిసి దాదాపు నాలుగు బుల్లెట్ వాహనాలు చోరీ చేశారని విచారణలో తేలిందన్నారు. మౌలాలి అనే దొంగను అరెస్టు చేసి ఒక బుల్లెట్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో దొంగను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

వృక్షశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



రాజశేఖర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న ఎస్. రాజశేఖర్ రెడ్డికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ఆచార్య మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో 'డొమెస్టికేషన్ ఆఫ్ వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ శేషాచలం బయోస్ఫియర్ రిజర్వ్, ఆంధ్ర ప్రదేశ్, ఇండియా' అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయ సేవా సదన్‌లో 'మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల శిక్షణ' అనే అంశంపై సోమవారం ప్రారంభ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి. ఇది ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. ఇంకా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేరళ నుంచి వచ్చిన రీసోర్స్ పర్సన్‌లు పీజీ సురేష్, జిజ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



లింగంపల్లి వాటర్ వర్క్స్ వద్ద పెన్నాలో నిల్వ చేసిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రస్తుత వేసవి కాలంలో కడప నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టామని నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన లింగంపల్లి వాటర్ వర్క్స్ వద్ద పెన్నానదిలో నీటి నిల్వ భద్రతకు అనుసరించాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు వచ్చే వరకూ నగరంలో నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీటి మోటార్ల మరమ్మతులు, అవసరమైన ఇతర పనుల గూర్చి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ నారాయణస్వామి, ఏఈ అంజలీ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 26 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-10, టౌన్‌ప్లానింగ్-5, రెవెన్యూ విభాగం-8, పబ్లిక్ హెల్త్ విభాగం-1, హౌసింగ్ విభాగం-1,యూపీయే విభాగం -1 అర్జీలు వచ్చాయి. ప్రజలు ఇచ్చిన అర్జీలను శాఖాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి, స్వయంగా వెళ్లి ఆ సమస్యలను న్యాయ పద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి



సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగాలను కల్పించే స్థాయికి ఎదగాలని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటి చైర్మెన్(ఐఏఎల్ఏ) శేషారెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎల్ఏ చైర్మెన్ శేషారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడే తత్వానికి అలవాటు పడాలన్నారు. అప్పుడే అనుకున్న దానిని సాధించగలరన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగి వారి పేరును నిలబెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. అనంతరం సెమిస్టర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేశారు. తదనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

టెక్నికల్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



అపాయింట్‌మెంట్ లెటర్స్ అందుకున్న విద్యార్థులతో షిర్డిసాయి కంపెనీ ప్రతినిధులు, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో టెక్నికల్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ హెచ్ఆర్ మేనేజర్స్ సత్యనారాయణ, సుధీర్ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్లు ఎస్‌వీఎస్ సత్యనారాయణ, దాండే సుధీర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల నుంచి క్యాంపస్ సెలక్షన్స్‌లో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షతన అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనిత, హెచ్ఓడీలు శ్రీనివాసరావు, సుధారాణి, దామోదర్, సుమతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వసతులు కల్పించాలి



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని బడే రాత్ రోజు ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ కడప నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్టప్ సమీపంలోని అమీన్ ఈద్, దండు షాహి ఈద్, రిమ్స్ రహీముల్లా ఖాన్ ఈద్గాల వద్ద, మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లాలన్నారు. షామియానాలు, కార్పెట్లు, జంఖానాలు వేయాలని, స్పీకర్లు, సౌండ్ సిస్టమ్ పెట్టాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఫ్యాన్లు సమకూర్చాలన్నారు. ప్రతి ఈద్గా వద్ద వజు చేయడానికి ట్యాంకర్లతో నీటిని నింపి ఉంచాలన్నారు. తాగడానికి కూడా నీటిని ఏర్పాటు చేయాలని, కరెంటు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆరీఫుల్లా బాషా, జహీర్, జఫ్రుల్లా, అతావుల్లా, డీజీ అక్బర్ అలీ, బాబా, అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణతో ఆత్మవిశ్వాసం



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి, ధైర్యానికి తైక్వాండో శిక్షణ సహాయకారిగా నిలుస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి అన్నారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినిలకు క్యాంపస్‌లో తైక్వాండో రెండో విడత శిక్షణ తరగతులను కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొ.ఎస్.రఘునాథ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణను పెంపొందిస్తుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం గంటన్నరపాటూ నిపుణులు శిక్షణ ఇస్తారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తైక్వాండో శిక్షణ నిపుణులు నాగూర్ బాబు పాల్గొన్నారు.

మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 15 ఏళ్లుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న మీటరు రీడర్లను సంస్కరణ పేరిట తొలగించడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని తెలిపారు. వీరిలో ఐటీఐ అర్హత ఉన్న వారిని సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా, వాచ్ అండ్ వార్డుగా నియమించాలని కోరారు. సర్కిల్ ఆఫీసుల్లో అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లుగా నియమించేందుకు చర్యలు తీసకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, యూనియన్ నాయకులు గఫ్ఫార్‌బాష, కిరణ్‌కుమార్, వెంకట రమణ, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆల్‌మేవా నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) కడప జిల్లా అధ్యక్షులు పీఎం జలీల్ ఖాన్ అన్నారు. సోమవారం కడప రహమతీయ ఫంక్షన్ హాల్లో ఆల్ మేవా ఆధ్వర్యంలో 'ఇఫ్తార్ విందు' ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం తన వంతుగా జకాత్ ను అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ మేవా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎస్. ఎ. యస్ ఫరూక్ అన్నారు. ఆల్ మేవా రాష్ట్రంలోని మైనారిటీ ఉద్యోగుల హక్కుల, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదన్నారు. టీడీపీ నాయకులు అమీర్ బాబు, సంఘ సేవకులు సలావుద్దీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెకె యూత్ అధ్యక్షులు ఖాదర్ బాషా, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షులు అష్రఫ్ అలీ ఖాన్, ప్రముఖ దంత వైద్యులు సంఘం నాజిముద్దీన్, రఫీక్ ఖాన్, ప్రముఖ ఆడియాలజీ మదన్మోహన్ రెడ్డి, అన్నమయ్య అధ్యక్షులు జుబేర్ అలీ ఖాన్, ఆల్ మెవ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సనావుల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్ బాష, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 77ను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న జీఓ నంబర్ 77 ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్‌ను కలిసి ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్ర బాబు, పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా నాయకులు భరత్, హర్ష, దామోదర్, మురళి క్రిష్ణ, శివ పాల్గొన్నారు.

ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని వల్లూరులో ప్రశ్నపత్రం లీకేజీపై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖానకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలోని వల్లూరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రశ్నపత్రం లీకేజ్ కావడం చూస్తుంటే ఇష్టారాజ్యంగా కాపీలు జరిపిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇవి కాకుండా కమలాపురం, పెండ్లిమర్రి, వెల్లటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో కూడా కాపీలు రాయిస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటి పైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

కడప ఎడ్యుకేషన్ : క్షయ వ్యాధి నిర్మూలనలకు కృషి చేయాలని జిల్లా రిటైర్డ్ మెడికల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం, కానాల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కడపలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుణశేఖర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి అని, ఇది ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేయడంతోపాటు గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ, వివేకానంద మహిళా డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్.మనోహర్ రెడ్డి, డైరెక్టర్ మధుసూధన్ రెడ్డి, కానాల సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కానాల ఈశ్వరయ్య, మీకోసం విష్ణువర్ధన్, అమ్మసేవాసమితి శివశంకర్, బాసట సేవా సంస్థ సభ్యులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కొత్తపేట గంగమ్మ దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం ఈఓలు కృష్ణానాయక్, మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ ఆరు నెలల కాలానికి, జాతరకు సంబంధించి భక్తులు హుండీలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 8,15,239 నగదు వచ్చినట్లు తెలిపారు. అలాగే గంగమ్మ జాతర సందర్భంగా మూడు ఆదివారాలు టికెట్లు విక్రయించగా రూ. 3,19,747 ఆదాయం లభించనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులతో పాటు సిబ్బంది, సేవకులు, ఇండియన్ బ్యాంకు సిబ్బంది, ఏఎస్ఐ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్: వడ్డీవ్యాపారి వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్ (40) అనే వ్యక్తిని దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిషోర్ సోమవారం పరామర్శించారు. అనంతరం కిషోర్, కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంకు వెళ్లి జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్‌కు ఈ సమస్యను విన్నవించారు. వడ్డీ వ్యాపారంను చేస్తూ, ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్న వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు కిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిమాత ఉత్సవాలు



శ్రీ చౌడేశ్వరీమాత జ్యోతులతో భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి భక్తులు ఊరేగింపుగా కలశాలతో బిందెసేవ నిర్వహించారు. మేళతాళాలు, తప్పెట్ల హోరుతో ఆలయం వద్ద జ్యోతులు, ఛత్రాలతో పలు విన్యాసాలు చేశారు. ప్రత్యేకంగా కలశాలు ధరించిన భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాత్రి శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతిని ఆలయ అధ్యక్షులు కళ్యా సుధాకర్ వెలిగించారు. జ్యోతులు ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో తలపై ఉంచుకొని, అమ్మవారి భక్తి గీతాలు ఆలపిస్తూ వీర నృత్యాలు చేస్తూ సాగారు. ఆలయం సమీపంలో బాణసంచా పేలుస్తూ మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారు జ్యోతి స్వరూపిణిగా పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్యోతి ఉత్సవాలను చూసేందుకు కడప నగరంతోపాటు వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలిరావడంతో ఎర్రముక్కపల్లెలోని అన్ని వీధులు కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి టేకూరి పుష్పాంగద, కోశాధికారి ఇడెం మల్లికార్జున, ఉపాధ్యక్షులు రెబ్బ హరిబాబుతోపాటు నిర్వహణ, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : బీసీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్ విద్యార్థులకు గరిష్ఠంగా రోజుకు రూ. 56 ఇవ్వడం ఏమాత్రం న్యాయమని ప్రశ్నించారు. 3, 4 తరగతి హాస్టల్ విద్యార్థులకు రూ. 38, 5 నుంచి 9 తరగతి విద్యార్థులకు రూ. 48, ఆపై తరగతుల విద్యార్థులకు రూ. 56 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ప్రస్తుత ధరల నేపథ్యంలో ఇది ఏ మూలకు సరిపోదని తెలిపారు. బీసీ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న కపట ప్రేమకు ఇది నిదర్శమని విమర్శించారు. మెస్ ఛార్జీల కింద రోజుకు రూ.150, కాస్మోటిక్ ఛార్జీల కింద నెలకు రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ హాస్టళ్లకు శాశ్విత భవనాలు నిర్మించాలని కోరారు. బీసీ బాలికల హాస్టళ్లకు వాచ్‌మెన్, హెల్పర్లు, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బీసీ విద్యార్థులకు ఫీజు సడలింపులు కలిప్పించి పోటీ పరీక్షల్లో పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ శాఖ అధ్యక్షులు విజయ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు వెంకట యాదవ్, రంగస్వామి నాయక్, వైఎస్సార్ జిల్లా నాయకులు భాస్కర్, పి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని నాగరాజు పేట పరిధిలో ఉన్న బుగ్గ వంక నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలం చెందారని సీపీఎం నగర కార్యదర్శి ఏ. రామ్మోహన్ తెలిపారు. సోమవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 23వ డివిజన్ నాగరాజు పేట బుగ్గ వంక నిర్వాసితుల ప్రాంతాలలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో రోడ్లు డ్రైనేజీ సమస్య దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నాగరాజు పేటలో మంచినీటి సమస్య ఉందని, గత నాలుగు రోజుల నుంచి నీళ్లు రాలేదని రంజాన్, ఉగాది పండగలను దృష్టిలో పెట్టుకొని మంచినీళ్ల ఇవ్వాలన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకపోతే చలో కార్పోరేషన్ చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు జమీల, సరిత, విజయ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఈకేవైసీ పేరుతో రేషన్‌కార్డు తొలగిస్తే ఆందోళన



ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఈకేవైసీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులను తొలగిస్తే ఆందోళన తప్పదని సీపీఎం నగర కార్యదర్శి ఆదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కడప భగత్‌సింగ్‌నగర్ కాలనీలో నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో భాగంగా రేషన్‌షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బియ్యం కార్డు దారులు డీలర్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయాలని, ఈనెల చివరి వరకు మాత్రమే గడువు విధించిందన్నారు. ఇందువల్ల సామాన్య, పేద ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈకేవైసీ గడువు జూన్ చివరి వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. కార్డుదారుల పిల్లలు బయటి ప్రాంతాల్లో చదువుకుంటున్నారని, కొంత మంది వలసలు వెళ్లారని తెలిపారు. గడువు పొడిగించకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఇమ్రాన్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు గొడుగులు పంపిణీ



గొడుగు అందిస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలో రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్న వారికి గొడుగులు పంపిణీ చేసినట్లు కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ కె.మురళీమోహన్ తెలిపారు. సోమవారం దాదాపు 60-80 మందికి గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వ్యాపారాలు చేసే వారికి ఎలాంటి వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తమ బ్యాంకు తరపున ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వ్యాపారాలు చేసుకునే వారు ఈ గొడుగులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు ఎస్.రమేష్, షఫీక్ అహ్మద్, విలియం, అవినాష్, మధుకర్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.